అబద్ధాలు చెప్పడం కాంగ్రెస్‌కు అలవాటే..

- కాంగ్రెస్ పాలన తీరును ప్రజలు గ్రహిస్తున్నారు
- ప్రతిపక్షంలో ఉన్నా భయపడాల్సిన అవసరంలేదు
- ప్రతి కార్యకర్తకూ అండగా ఉంటాం
- స్థానిక సంస్థల మాజీ ప్రజాప్రతినిధుల సన్మాన సభలో ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్


స్థానిక సంస్థల మాజీ ప్రజాప్రతినిధుల సన్మాన సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి, చిత్రంలో మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్

షాద్‌నగర్, జూలై 8 : అబద్ధాలు చెప్పడం కాంగ్రెస్ పార్టీకి అలవాటే అనే విషయం అన్ని వర్గాల ప్రజలకు తెలుసని, కాంగ్రెస్ ప్రభుత్వ పనితీరు ఎలా కొనసాగుతున్నదో రాష్ట్ర ప్రజలు గమనిస్తున్నారని ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ అన్నారు. షాద్‌నగర్‌లో నిర్వహించిన స్థానిక సంస్థల తాజా మాజీ ప్రజాప్రతినిధుల సన్మాన సభలో వారు మాట్లాడారు. అబద్ధాలను చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ కనీసం సర్పంచ్‌ల, ఎంపీటీసీల గౌరవ వేతనాలను కూడా ఇవ్వలేని దుస్థితిలో ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. 420 హామీలు దేవుడేరుగు కానీ ఇచ్చిన ఆరు గ్యారంటీలను కూడా అమలుచేయడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. నేడు రాష్ట్ర ప్రజలు బీఆర్ఎస్ పాలనలో జరిగిన అభివృద్ధి గురించి చర్చించుకుంటున్నారే తప్పా కాంగ్రెస్ ప్రభుత్వంపై నమ్మకంతో లేరన్నారు. బీఆర్ఎస్ పాలనలో సేవలు అందించిన స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు చిరకాలం చరిత్రలో నిలుస్తారని, ఎన్నడూ లేని విధంగా గ్రామాలు, మండలాల్లో అభివృద్ధి పనులు కొనసాగాయని చెప్పారు.

శ్మశానవాటికలు, హరితహారం, పల్లె ప్రకృతి వనాలు, పారిశుధ్య నిర్వహణ పనులు, సీసీ రోడ్లు, అంతర్గత మురుగు కాలువలు, వన నర్సరీలు వంటి ఎన్నో పనులను చేసి విజయవంతం అయ్యారని కొనియాడారు. అప్పటి ప్రభుత్వం ప్రవేశపెట్టిన రైతు బంధు, రైతు బీమా, కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్, కేసీఆర్ కిట్లు, ఆసరా పింఛన్లు, మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ వంటి ఎన్నో సంక్షేమ పథకాల్లో ప్రత్యక్షంగా భాగస్వాములై ప్రజల మనస్సును గెలుచుకున్నారని కొనియాడారు. మీ సేవలను ప్రజలు ఎన్నటికీ మర్చిపోరని, ఇదే స్ఫూర్తితో రానున్న రోజుల్లో ప్రజా సేవలో రాణించాలని వారు కోరారు.

ప్రతిపక్షంలో ఉన్నంత మాత్రాన భయపడవల్సిన అవసరం లేదని, ప్రజల పక్షాన పని చేస్తే ప్రజల అండదండలతో పాటు పార్టీ అండగా ఉంటుందన్నారు. ప్రతి పార్టీలో పదవులు ముఖ్యం కాదనే విషయాన్ని గ్రహించాలని, కచ్చితంగా అవకాశం వచ్చినప్పుడు పదవులు వరిస్తాయని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం పనితీరును ఎండగడుతూ, బీఆర్ఎస్ ప్రభుత్వంలో చేపట్టిన పనులను ప్రజలకు వివరించి చర్చ పెట్టాలని పార్టీ శ్రేణులకు సూచించారు. రానున్న రోజుల్లో నిర్వహించే స్థానిక సంస్థల ఎన్నికల్లో కచ్చితంగా బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థులు గెలుస్తారని చెప్పారు. ఈ సందర్భంగా షాద్‌నగర్ నియోజకవర్గంలోని తాజా మాజీ స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులను సన్మానించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ నరేందర్, వైస్ చైర్మన్ ఎంఎస్. నటరాజన్, మాజీ జడ్పీ వైస్ చైర్మన్ గణేష్, మాజీ జడ్పీటీసీలు శ్రీలత, స్వరూప, రాఘవమ్మ, నాయకులు రాజావరప్రసాద్, నారాయణ, రాజ్యలక్ష్మి, నారాయణరెడ్డి, సత్యనారాయణ, శ్రీధర్‌రెడ్డి, మిట్టూనాయక్, పద్మారెడ్డి, లక్ష్మణ్‌నాయక్, హఫీజ్, బక్కన్నయాదవ్, అశోక్, విఠల్, రామకృష్ణ, ఆయా మండలాల బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

తెలంగాణ ముఖ్య కార్యదర్శి, రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి చైర్మన్ శాంతకుమారిని పాల్యూషన్ కంట్రోల్ బోర్డు సభ్యుడు సత్యనారాయణరెడ్డి సోమవారం సచివాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి మొక్క అందజేశారు. - చేవెళ్ల రూరల్, జూలై 8

ఇబ్రహీంపట్నం ఏజీపీగా దండె వాణి

ఇబ్రహీంపట్నం, జూలై 7 : ఇబ్రహీంపట్నం కోర్టులకు అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్‌గా దండె వాణిని ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు రంగారెడ్డి కలెక్టర్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా వాణి మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో నియామకానికి సహకరించిన ఎమ్మెల్యే రంగారెడ్డితో పాటు సీనియర్ న్యాయవాది, కాంగ్రెస్ లీగల్ సెల్ జిల్లా చైర్మన్ వేణుగోపాల్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ పదవి తన బాధ్యతను మరింత పెంచిందన్నారు. న్యాయం కోసం వచ్చే ప్రతి ఒక్కరికీ సరైన న్యాయం చేకూరుస్తానని ఆమె సోమవారం తెలిపారు.

ఎంపీడీవో నరేందర్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న యువకుడు శేఖర్

కంపచెట్లు తొలగించాలి

యాచారం, జూలై 8 : మండలంలోని మేడిపల్లి నుంచి యాచారం వరకు గల రోడ్డుకు ఇరువైపులా ఉన్న కంపచెట్లను తొలగించాలని కోరుతూ మల్కీజ్‌గూడ గ్రామానికి చెందిన యువకులు సోమవారం ఎంపీడీవో నరేందర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. మేడిపల్లి, మల్కీజ్‌గూడ, గాండ్లగూడ గ్రామాలకు చెందిన రోడ్డుకు ఇరువైపులా కంప, తుమ్మ చెట్లు విపరీతంగా పెరిగాయని వాపోయారు. కంప చెట్లు రోడ్డును మింగడంతో చిన్నచిన్న ప్రమాదాలు చోటు చేసుకుంటున్నట్లు ఎంపీడీవోకు తెలిపారు. రాత్రిపూట సమస్యగా ఉన్నట్లు పేర్కొన్నారు.సమస్యను వెంటనే పరిష్కరించనున్నట్లు ఎంపీడీవో హామీ ఇచ్చినట్లు వారు పేర్కొన్నారు.

న్యూట్రిషన్ కిట్లు పంపిణీ చేస్తున్న నాయకుడు విజయేందర్‌రెడ్డి

వృద్ధులకు న్యూట్రిషన్ కిట్ల పంపిణీ

పెద్దఅంబర్‌పేట, జూలై 8 : పెద్దఅంబర్‌పేట లక్ష్మారెడ్డిపాలెంలోని చిల్డ్రన్ ఆఫ్ డెక్కన్ ఫౌండేషన్ కార్యాలయంలో 100 మందికిపైగా వృద్ధులు, దివ్యాంగులకు న్యూట్రిషన్ కిట్లు పంపిణీ చేశారు. తమ సంస్థ ఆధ్వర్యంలో ఎంతోమంది పేద విద్యార్థులకు నోటు పుస్తకాలు, పెన్నులు తదితరాలు పంపిణీ చేశామని ఫౌండేషన్ చైర్మన్ మల్కన్న తెలిపారు. కార్యక్రమంలో స్థానిక నాయకుడు విజయేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

హామీలను వెంటనే అమలు చేయాలి

జిల్లాలోని పలు మండలాల్లో మండల అధికారులకు వినతిపత్రాలు అందజేసిన బీజేపీ కిసాన్ మోర్చా నాయకులు


అబ్దుల్లాపూర్‌మెట్ : తహసీల్దార్‌కు వినతిపత్రమిస్తున్న బీజేపీ కిసాన్ మోర్చా నాయకులు

అబ్దుల్లాపూర్‌మెట్, జూలై 8 : కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో రైతులకిచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ అబ్దుల్లాపూర్‌మెట్ మండల బీజేపీ కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కిసాన్ మోర్చా నాయకులు మాట్లాడుతూ.. రైతులకు పెట్టుబడి సాయం రూ.15వేలు, కౌలు రైతులకు రూ.15 వేలు వెంటనే అందించాలని డిమాండ్ చేశారు. ఏకకాలంలో రూ.2 లక్షల రుణమాఫీ చేయడంతోపాటు వరికి రూ.500 బోనస్ కూడా అందించాలని వారు కోరారు. కార్యక్రమంలో తుర్కయాంజాల్ రైతు సేవా సహకార సంఘం వైస్ చైర్మన్ రాంరెడ్డి, కిసాన్ మోర్చా మండల అధ్యక్షుడు ధర్మారెడ్డి, ప్రధాన కార్యదర్శి కొండల్‌రెడ్డి, నాయకులు పాపయ్యగౌడ్, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

యాచారం : ఆర్ఐ రామకృష్ణకు వినతిపత్రం ఇస్తున్న కిసాన్ మోర్చా నాయకులు

రుణమాఫీ చేయాలి

యాచారం : రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ ఇప్పుడు మాట మార్చడం సరైన పద్ధతి కాదని కిసాన్ మోర్చా మండల అధ్యక్షుడు విఠల్‌రెడ్డి అన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు అంజయ్య, భాస్కర్, రవీందర్‌రెడ్డి ఉన్నారు.


ఇబ్రహీంపట్నం : తహసీల్దార్ అనితకు వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

ఇబ్రహీంపట్నంలో..

ఇబ్రహీంపట్నం : రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు రైతులకిచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ సోమవారం బీజేపీ కిసాన్‌మోర్చా ఆధ్వర్యంలో ఇబ్రహీంపట్నం తహసీల్దార్ అనితకు వినతిపత్రం అందజేశారు. రైతులను అన్ని విధాలుగా ఆదుకుంటామని చెప్పిన కాంగ్రెస్ మేరకు రూ.2లక్షల రుణమాఫీని వెంటనే అమలు చేయాలని రాష్ట్ర కిసాన్ మోర్చా ప్రధాన కార్యదర్శి మర్పల్లి అంజయ్యయాదవ్ డిమాండ్ చేశారు. కిసాన్ మోర్చా పిలుపుమేరకు సోమవారం బీజేపీ మండల అధ్యక్షుడు తాండ్ర రవీందర్ ఆధ్వర్యంలో ఆర్ఐ రామకృష్ణకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా అంజయ్యయాదవ్ మాట్లాడుతూ.. రైతుల పట్ల రాష్ట్ర ప్రభుత్వానికి ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా వెంటనే రుణమాఫీ చేయాలన్నారు. అర్హులైన రైతులందరికీ రైతు భరోసా కింద ఎకరాకు రూ.15వేలు అందజేయాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ కూలీలకు సంవత్సరానికి రూ.12వేలు ఇవ్వాలన్నారు. తెలంగాణలో ప్రధాన మంత్రి పంటల బీమా యోజన అమలు చేయాలని కోరారు. లేదంటే కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో నిరంతరం ఉద్యమాలు చేస్తామని ఆయన హెచ్చరించారు.

షాబాద్‌లో..

షాబాద్ : రాష్ట్ర ప్రభుత్వం వెంటనే రూ.2లక్షల రైతు రుణమాఫీ చేయాలని బీజేపీ మండలాధ్యక్షుడు లంబాడి కిరణ్‌కుమార్ డిమాండ్ చేశారు. సోమవారం షాబాద్‌లోని రెవెన్యూ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ మధుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి ఒక్క హామీని అమలు చేయాలన్నారు. రైతులకు రైతు భరోసా, పంట బీమా, కౌలు రైతులకు ఏడాదికి 15వేల సాయం వెంటనే అమలు చేయాలన్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలన్నీ అమలు చేసేంత వరకు ప్రజల పక్షాన పోరాటం చేస్తామని ఆయన స్పష్టం చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు రాము, నారాయణ, శ్రీశైలం, రవిగౌడ్, రమేశ్, రాజేశ్, మహేందర్, రాజు, ప్రశాంత్ ఉన్నారు.

మాడ్గుల : తహసీల్దార్ సునీల్‌కుమార్‌కు సమస్యలపై విన్నవిస్తున్న బీజేపీ నాయకులు

మాడ్గులలో..

మాడ్గుల : రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సమయంలో రైతులకిచ్చిన హామీలను నెరవేర్చాలంటూ బీజేపీ కిసాన్ మోర్చా నాయకులు డిమాండ్ చేస్తూ సోమవారం తహసీల్దార్ సునీల్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు జంగయ్యగౌడ్, రమేశ్, శ్రీనివాస్‌యాదవ్, కృష్ణ ఉన్నారు.

షాబాద్ : డిప్యూటీ తహసీల్దార్ మధుకు వినతిపత్రమిస్తున్న కిరణ్‌కుమార్ తదితరులు

గుర్లకుంటతండాలో బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్‌రెడ్డి

ఆపదలో ఉన్నవారిని ఆదుకుంటాం

కడ్తాల్, జూలై 8 : ఆపదలో ఉన్నవారిని ఆదుకుంటామని మాజీ ఎంపీపీ శ్రీనివాస్ యాదవ్, మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. కడ్తాల్ గ్రామ పంచాయతీ పరిధిలోని గుర్లకుంట తండాకు చెందిన రాజూనాయక్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న మాజీ ఎంపీటీసీ సోమవారం ఉదయం స్థానిక నాయకులతో కలిసి బాధిత కుటుంబాన్ని పరామర్శించి, వ్యక్తిగతంగా రూ.5 వేలు ఆర్థిక సాయం అందజేశారు. అలాగే తలకొండపల్లి మండలం వెల్జాల్ గ్రామానికి చెందిన వెంకటమ్మ అనారోగ్యంతో బాధపడుతూ మరణించింది. విషయం తెలుసుకున్న మాజీ ఎంపీపీ బాధిత కుటుంబాన్ని పరామర్శించి, రూ.3 వేలు ఆర్థిక సాయం అందజేశారు. కష్టాల్లో ఉన్నవారికి అండగా ఉంటామని నాయకులు భరోసానిచ్చారు. కార్యక్రమంలో నాయకులు బిచ్చానాయక్, భాస్కర్‌రెడ్డి, హన్మానాయక్, రాంచందర్‌నాయక్, జహంగీర్‌బాబా, వేణు పంతులు, సత్యం, మల్లేశ్, మహేశ్, రవి పాల్గొన్నారు.

పుస్తెలతాడు లాక్కెళ్లిన యువకులు

షాబాద్, జూలై 8 : గుర్తు తెలియని వ్యక్తులు ఓ మహిళా మెడలో నుంచి పుస్తెల తాడును లాక్కెళ్లిన ఘటన షాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. షాబాద్ సీఐ కాంతారెడ్డి కథనం ప్రకారం.. మండలంలోని ఎల్గొండగూడ గ్రామానికి చెందిన కుమ్మరి చిల్కమ్మ సోమవారం ఉదయం 11:40 గంటల సమయంలో తన కోడలు భాగ్యలక్ష్మితో కలిసి పొలానికి వెళ్తున్నది. గ్రామ సమీపంలోకి వెళ్లగానే ఎదురుగా ఇద్దరు యువకులు ద్విచక్ర వాహనంపై వచ్చి చిల్కమ్మ మెడలో ఉన్న 3 తులాల పుస్తెలతాడును ఎత్తుకెళ్లినట్లు చెప్పారు. పుస్తెలతాడు గట్టిగా లాగడంతో ఆమెకు గాయాలైనట్లు తెలిపారు. సదరు మహిళ వారిని పట్టుకునేందుకు ప్రయత్నించగా వాకె పారిపోయారన్నారు. వారు సుమారు 25 నుంచి 35 సంవత్సరాల వయస్సు కలిగి ఉంటారని.. వాహనంపై వెనుక కూర్చున్న వ్యక్తి నలుపు రంగు టోపీ ధరించాడని, తాను వారిని మళ్లీ చూస్తే గుర్తుపట్టగలనని బాధితురాలు తెలిపింది. పుస్తెలతాడు లాక్కొని, తనను గాయపరిచిన వ్యక్తులపై తగిన చర్యలు తీసుకోవాలని చిల్కమ్మ షాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

1989-90 సంవత్సరంలో చేవెళ్ల జడ్పీహెచ్ఎస్‌లో పదో తరగతి చదివిన పూర్వవిద్యార్థులు దాదాపు 34 సంవత్సరాల తర్వాత కలుసుకున్నారు. ఈ సందర్భంగా సోమవారం తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సన్మానించారు. - చేవెళ్ల రూరల్, జూలై 8

హత్య కేసు నిందితులకు రిమాండ్

చేవెళ్ల రూరల్, జూలై 8 : ఈ నెల 4న అనుమానాస్పదంగా మృతి చెందిన వృద్ధుడి హత్య కేసును శంకర్‌పల్లి పోలీసులు ఛేదించారు. సీఐ హబీబుల్లాఖాన్ కథనం ప్రకారం.. నిందితులిద్దరు భార్యాభర్తలని, నిందితురాలు మల్లీశ్వరి మృతుడు అయిన వృద్ధుడు భీమయ్యకు వరుసకు మనుమరాలు అవుతుందన్నారు. భర్త సాయికుమార్‌తో కలిసి అప్పుడప్పుడు తన తాత భీమయ్య దగ్గరికి వస్తూ ఉండేదని తెలిపారు. ఎప్పటిలాగే ఈ నెల 3న మధ్యాహ్నం పిల్లలను తీసుకొని భీమయ్య దగ్గరికి వచ్చి సాయంత్రం ముగ్గురు కలిసి మద్యం సేవించారు. తాగిన మత్తులో భీమయ్య నిందితుడు సాయికుమార్‌ను పదేపదే తిట్టడంతో కోపంతో మనుమరాలు మల్లీశ్వరి కాళ్లుచేతులు పట్టుకోగా సాయికుమార్ కూరగాయల కత్తితో మెడపై దాడి చేయగా భీమయ్య అక్కడికక్కడే మృతి చెందాడని తెలిపారు. ఈ మేరకు నిందితులను చేవెళ్ల జేఎఫ్‌సీఎం కోర్టులో హాజరుపర్చి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ హబీబుల్లాఖాన్ తెలిపారు.

మట్టి రోడ్డుకు మరమ్మతులు

చేవెళ్ల రూరల్, జూలై 8 : చేవెళ్ల మండల పరిధిలోని రావులపల్లి గ్రామం నుంచి బండారి శ్రీనివాస్ ఇంజినీరింగ్ కాలేజ్ సమీపం నుంచి ధర్మసాగర్ వెళ్లే మట్టి రోడ్డును మాజీ ప్రజా ప్రతినిధి కేసారం శ్రీనివాస్, గ్రామస్తుల సొంత నిధులతో మరమ్మతులు చేయించి ప్రజలకు ప్రయాణం సాఫీగా జరిగేలా కృషి చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు రోడ్డును వేయించిన వారికి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.

సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఉప వైద్యాధికారి దామోదర్, ఎంపీడీవో వెంకయ్య

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ అనురాధ

చేవెళ్ల రూరల్, జూలై 8 : వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా గ్రామాల్లో అధికారులు ప్రజలను అప్రమత్తం చేయాలని జిల్లా ఉప వైద్యాధికారి దామోదర్ అన్నారు. సోమవారం శంకర్‌పల్లి మండల ప్రజా పరిషత్ సమావేశ మందిరంలో ఎంపీడీవో వెంకయ్య, ఐసీడీఎస్, ఐకేపి, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఉప వైద్యాధికారి దామోదర్ మాట్లాడుతూ.. దోమల వ్యాప్తి నివారణకు గ్రామాల్లో క్రమం తప్పకుండా ఫాగింగ్ చేయించాలని, ఇండ్ల పరిసరాల్లో గడ్డి, పిచ్చి మొక్కలు పెరగకుండా, మురుగు గుంతలు లేకుండా చర్యలు తీసుకొని, ప్రతి శుక్రవారం డ్రై డేను పాటించాలని సూచించారు. సీజనల్ వ్యాధుల పట్ల గ్రామీణ ప్రజల్లో అవగాహన పెంచాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీవో గీత, ఏపీవో నాగభూషణం, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ డాక్టర్ మహేశ్వరరావు, ప్రభుత్వ దవాఖాన వైద్యులు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

అలసత్వం తగదు

తుర్కయాంజాల్ : సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తుర్కయాంజాల్ మున్సిపాలిటీ చైర్‌పర్సన్ మల్‌రెడ్డి అనురాధ అన్నారు. సోమవారం తుర్కయాంజాల్ మున్సిపాలిటీ పరిధి రాగన్నగూడ వార్డు కార్యాలయంలో డాక్టర్లు, వైద్య సిబ్బంది, మున్సిపల్ అధికారులతో చైర్‌పర్సన్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. మున్సిపాలిటీలో పైపులైన్ లీకేజీ జరుగకుండా హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్‌బీ అధికారులకు సూచించారు. పారిశుధ్య సిబ్బంది పారిశుధ్య నిర్వహణలో అలసత్వం ప్రదర్శించవద్దని ఆమె పేర్కొన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన

ఆమనగల్లు : సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమతంగా ఉండాలని మండల ప్రత్యేక అధికారి సుజాత తెలిపారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో సోమవారం మండల ఎంపీడీవో కుసుమ మాధురి అధ్యక్షతన సీజనల్ వ్యాధులపై అవగాహన సమావేశం నిర్వహించారు. సమావేశానికి హాజరైన సుజాత మాట్లాడుతూ.. పరిసరాల పరిశుభ్రత పాటిస్తే వ్యాధులను అరికట్టవచ్చన్నారు. వర్షపు నీరు నిల్వ ఉన్న చోట ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని సూచించారు. సీజనల్ వ్యాధులపై పంచాయతీ కార్యదర్శులు, ఆరోగ్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు ప్రజలకు అవగాహన కల్పించాలని ఆమె సూచించారు.

ఆమనగల్లు : మాట్లాడుతున్న మండల ప్రత్యేక అధికారి సుజాత

భాస్కర్ మృతి బీఆర్ఎస్‌కు తీరని లోటు

బీఆర్ఎస్ రంగారెడ్డిజిల్లా అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి


భాస్కర్ మృతదేహానికి నివాళులర్పిస్తున్న మంచిరెడ్డి కిషన్‌రెడ్డి

ఇబ్రహీంపట్నంరూరల్, జూలై 8 : తులేకలాన్ ఎంపీటీసీ నాగటి నాగమణి భర్త భాస్కర్ మృతి బీఆర్ఎస్‌కు తీరని లోటని ఆ పార్టీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు, ఇబ్రహీంపట్నం మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి అన్నారు. భాస్కర్ ఇబ్రహీంపట్నంలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నాడు. శనివారం మధ్యాహ్నం గుండెపోటుతో మృతిచెందాడు. భాస్కర్ అంత్యక్రియలు సోమవారం స్వగ్రామమైన తులేకలాన్ గ్రామంలో కుటుంబసభ్యుల సమక్షంలో నిర్వహించారు. ఆయన అంత్యక్రియలకు హాజరైన కిషన్‌రెడ్డి, ప్రశాంత్‌కుమార్ రెడ్డి, గ్రంథాలయ సంస్థ జిల్లా మాజీ చైర్మన్ వెంకటమరణారెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రాములు, పలువురు నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు ఆయనకు నివాళులర్పించారు.

2005-2006లో మంచాల మండలం రంగాపూర్ జిల్లా పరిషత్ పాఠశాలలో పదో తరగతి చదువుకున్న విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం సందర్భంగా సోమవారం ఓ ఫంక్షన్ హాల్‌లో అప్పటి గురువులను సన్మానించారు. - మంచాల, జూలై 8


ఆమనగల్లు మున్సిపాలిటీకి శ్రీకాంత్ కాలనీకి చెందిన బొందల బాలస్వామి ఆనారోగ్యంతో శనివారం మృతి చెందగా.. విషయం తెలుసుకున్న ఆమనగల్లు శివదీక్ష స్వాములు మృతుడి కుటుంబాన్ని పరామర్శించి మృతుడి కుటంబానికి రూ. 40 వేల ఆర్థిక సాయం అందజేశారు. - ఆమనగల్లు, జూలై 8

మంచాల, జూన్ 8 : మంచాల మండలం ఆరుట్ల గ్రామపంచాయతీ మాజీ సర్పంచ్ కొంగర విష్ణువర్ధన్‌రెడ్డి, ఉపసర్పంచ్ జంగయ్యగౌడ్, ఎంపీటీసీలు చీరాల రమేశ్, కావలి శ్రీనివాస్‌లతో పాటు పాలకవర్గ సభ్యులను సోమవారం ఆరుట్ల గ్రామపంచాయతీ కార్యాలయ ఆవరణలో సన్మానిస్తున్న గ్రామ ప్రత్యేకాధికారి, ఎంపీడీవో బాలశంకర్, పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్